# అద్దె భవనం జప్తు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13,ప్రభాతవార్త:**

చిన్నశంకరంపేట పట్టణ పంచాయతికి సంబంధించిన అద్దె భవనాల సముదాయంలో ఒక దుకాణాన్ని స్వాదీనం చేసుకున్నట్లు పంచాయతీ ఈవో సంతోష్ కుమార్ తెలిపారు. అద్దె భవనాల సముదాయంలోని 12వ నెంబర్ దుకాణాన్ని గత కొన్ని సంవత్సరాల క్రితం అవుసుల నరేష్ అద్దెకు తిసుకున్నాడు. గత రెండు సంవత్సరాలుగా అద్దెను చెల్లించకపోవడంతో పలుమార్లు నోటిసులు అంటించినట్లు ఈవో సంతోష్ తెలిపారు. దుకాణం జప్తు నోటిసు అంటించినప్పటికి యజమాని నుండి ఎటువంటి సమాదానం రాకపోవడంతో పంచాయతీ సిబ్బందితో కలిసి శుక్రవారం దుకాణాన్ని జప్తు చేసి అందులోని సామాగ్రిని పంచాయతీ కార్యాలయంకు తరలించినట్లు ఆయన తెలిపారు. దుకాణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అధికారులను సంప్రదించి ఈ దుకాణాన్ని కిరాయి ఉండటానికి వేలం వేస్తామని ఆయన తెలిపారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# చెడు అలవాట్లకు బానిసలు కావద్దు : ఎస్ఐ

**కొండపాక, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నకిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీ టీం నిర్వహిస్తున్న విధుల గురించి విద్యార్థులకు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, షీ టీం బృందం సభ్యుడు శ్రీరాములు, శ్యామల వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షీ టీం ద్వారా ఎలా రక్షణ పొందవచ్చు అనే విషయాలను వివరించారు. ర్యాగింగ్, ఇవ్‌టీజింగ్, ఫోక్సో, షీ టీం, యాంటీ హ్యూమన్ ట్రాపికింగ్, సైబర్‌నేరాలు, నూతనచట్టాల గురించి తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్, మాటలు నమ్మవద్దని సూచించారు. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు పోలీసు వ్యవస్థ ఎప్పుడు సిద్దంగా ఉంటుందని తెలిపారు. చదువు కునే వయస్సులో చెడుఅలవాట్లకు బానిస కావద్దని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టిసారించి శ్రద్దగా చదువుకొవానలని తెలిపారు. చదువుకుంటేనే భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్, విద్యార్థులు



కర్మాగారాల ప్రతినిధులకు సూచనలు చేస్తున్న మంత్రి రాజనర్సింహా

## సిఎస్ఆర్ ఫండ్స్ పనులు పూర్తి చేయాలి

**-కర్మాగారాల ప్రతినిధులకు మంత్రి సూచన**

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** జిల్లాలో సామాజిక, విద్యా, వైద్యరంగాలలో అభివృద్ధి పనులకై సిఎస్ఆర్ ఫండ్ కేటాయింపుపై శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్‌లో కర్మాగారాల ప్రతినిధుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి సమీక్షించారు. ఈ సందర్బంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ జిల్లాలోని కర్మాగారాలు జిల్లా అభివృద్ధికి సిఎస్ఆర్ ఫండ్స్‌ను తమ వంతు బాధ్యతగా 2 శాతం నిధులను విడుదలచేయాలని ప్రతినిదులకు మంత్రి సూచించారు. గతంలో సిఎస్ఆర్ ఫండ్స్‌తో చేపట్టిన పనులు పూర్తి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కర్మాగార ప్రతినిధులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదును భారీగా చేయాలి

**-కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్**



వంటిమామిడి కూరగాయల మార్కెట్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి, మెదక్ ఎంపి

**ములుగు, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును భారీగా చేయించాలని కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావులు ములుగు మండల బిజెపి నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ములుగుమండలం వంటిమామిడి కూరగాయల మార్కెట్‌లో రైతులచే సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో ములుగు, వర్గల్, మర్కుక్ మండలాల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, బాల్‌రెడ్డి, రామిరెడ్డి, ములుగు మండల మాజీ అధ్యక్షుడు రమేష్‌యాదవ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన సిపి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రాజగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏ.శంకర్ కానిస్టేబుల్‌ను సస్పెండూ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ డా॥ అనురాధ తెలిపారు. కానిస్టేబుల్ పోలీసు శాఖలె సీసీఏ రూల్స్ అతిక్రమించి క్రమశిక్షణ రహితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు రాగా విచారణ జరిపిన అనంతరం నిజ నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ వివరించారు. క్రమశిక్షణలో విధులు నిర్వహించాలని సూచించారు. క్రమ శిక్షణ రహితంగా విధులు నిర్వహించే అధికారులను సిబ్బందిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## ఎంపిడిఓ కార్యాలయంలో ఓటరు లిస్ట్

**మర్కుక్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసినట్లు ఎంపిడిఓ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు 2024 గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి 16 గ్రామపంచాయతీల ఓటరు లీస్టును మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఓటరు లీస్టులో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. లీస్టులో పేర్లు రానివారు వెంటనే ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

**జిల్లా గ్రామీణాబివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు**

నర్సాపూర్ సెప్టెంబర్ 13. ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా గ్రామీణాబివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్బంగా ఆయన నర్సాపూర్ మండల పరిధిలోని పెద్దచింతకుంట, రుస్తుంపేట గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నడుస్తున్న ఉపాధీ హామీ పనులను గ్రామాల పరిసరాలను. పారిశుధ్యాన్ని ఆయన పరిశీలించారు.అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతేగాక ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని అయన తెలిపారు. అనంతరం పెద్దచింతకుంట గ్రామంలో ఉపాదీ హామీ పథకంలో నడుస్తున్న పనులను ఆయన పరిశీలించారు.ప్రతి ఒక్కరు పరిసరాలను ఎప్పడికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఎటువంటి వ్యాదులు దరికిచేరవని అన్నారు. ఈసీజన్‌లో ఎవ్వరికైనా జ్వరాల బారిన పడినచో వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు వెళ్ళాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఏపిఓ అంజిరెడ్డి, ఈసీ ముజీబ్‌ఖురేసి, టిఏ మురళీ, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఏఫ్ఏ భాస్కర్, అంగన్‌వాడి కార్యకర్తలు ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.



గ్రామాల్లో పరిసరాలను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు తదితరులు

# పరిశుభ్రతకు నిలయంగా జిల్లా మారాలి

- డంపింగ్‌యార్డులకు స్థల సేకరణ చేయాలి
- చెరువులు, కుంటలు అన్యాక్రాంతి కాకుండా చూడాలి
- అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశం



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

జిల్లాలోని ప్రతి ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా, సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ వారానికి రెండు పర్యాయాలు ఫాగింగ్ చేయాలని, డెంగ్యూ కేసులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తడిపొడి చెత్తను ప్రజలు వేరు వేరుగా చేసి ఇండ్ల ముందుకు వచ్చే వాహనాలకు అందించాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో డంపు యార్డులు అవసరం ఉన్న చోట స్థలాలను సేకరించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జిన్నారం మండలంలోని డెలివరీ ఆసుపత్రిలో 24 గంటల సర్వీస్ అందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలోని హెచ్ఎండిఏ పరధిలో గుర్తించిన చెరువులు, కుంటలు ఆక్రమణకు గురి కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఆక్రమణకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వర్షాలతో నష్టపోయిన పంట నష్టం అంచనాలు, చెరువుల కుంటలో జరిగిన నష్టం వివరాలను వెంటనే పూర్తిస్థాయిలో నివేదిక అంద చేయాలని సూచించారు. రుణమాఫీలో లబ్ది పొందిన వారికి వెంటనే పంట రుణాలను మంజూరు చేయాలని అదేశించారు. కార్యక్రమలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాధురి, మున్సిపల్, నీటి పారుదల శాఖ, పరిశ్రమల శాఖ, పంచాయితీరాజ్ శాఖ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అంబులెన్స్ ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

## బెదిరింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన

**నాలుగు గంటల పాటు రోడ్డుపై బైఠాయింపు..పోలీసుల హామీతో ఆందోళన విరమణ**

**రామాయంపేట, సెప్టెంబర్ 13,ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొంత మంది బంధువుల బెదిరింపుల వల్ల ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మృతుడి బంధువులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఆత్మహత్య చేసుకున్న రైతు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించడానికి అంబులెన్స్‌లో తీసుకోస్తుండగా ఆసుపత్రికి సమీపంలో అడ్డుకున్నారు. రామాయంపేట మండలం సుతార్‌పల్లి బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రైతు పున్న స్వామి భూ వివాదంలో తన వ్యతిరేకులకు మద్దతు తెలుపుతూ అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు నాయకులతో పాటు కొందరు కుటుంబ సభ్యులు తనను బెదిరింపులకు గురి చేశారని ఆరోపిస్తూ,.... గత నాలుగు రోజుల క్రితం సెల్ఫి విడియో తీస్తూ బాధిత రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. గురువారం రోజు చికిత్స పొందుతూ మృతి చెందగా మృత దేహంతో బంధువులు రామాయంపేట మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. అంబులెన్స్ ముందు బైఠాయించి నిరసనకు దిగారు. సుమారు నాలుగు గంటల పాటు ఆందోళన చేశారు. ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు, బందువులపై హత్యా నేరం నమోదు చేయాలని, రైతు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్బంగా పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. వారిపై హత్యా నేరం కేసు నమోదు చేసే వరకు మృత దేహాన్ని తరలించమని రోడ్డుపై కూర్చోన్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకోంది. పలుసార్లు పోలీసులు వారికి నచ్చచెప్పె ప్రయత్నం చేశారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ప్రారంభమైన ఆందోళన సాయంత్రం ఆరున్నర గంటల వరకు కొనసాగింది. ఎట్టకేలకు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు కచ్చితమైన హామి ఇవ్వడంతో మృతుని కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు. ముందు జాగ్రత్త చర్యగా స్థానిక సిఐ వెంకట రాజాగౌడ్ ఆధ్వర్యంలో భారి బందోబస్తును ఏర్పాటు చేశారు.



రాట్ల సూర్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గడ్డం శ్రీనివాస్

## దుబాయ్ నుంచి తిమ్మక్కపల్లికి చేరుకున్న రాట్ల సూర్య నాయక్ మృతదేహం

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** పదిహేను రోజుల నుంచి ఎదురుచూస్తున్న రాట్ల సూర్య నాయక్ మృతదేహం శుక్రవారం దుబాయ్ నుండి మృతుని స్వగ్రామానికి చేరుకుంది. మృతదేహం దుబాయ్ నుంచి మృతుని గ్రామానికి చేరుకోవడానికి ప్రయత్నం చేసిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మురళీధర్‌రెడ్డిలకు మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాట్ల సూర్య అబుదాబిలో మరణించడానికి వార్త తెలిసిన వెంటనే గ్రామస్థులు, కుటుంబ సభ్యులు బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావును ఆశ్రయించడం జరిగింది. వారు వెంటనే స్పందించి భారత ప్రభుత్వ ఎంబసీ, అబుదాబిలో ఒక అడ్వకేట్‌ను, రాజా శ్రీనివాసరావు టీమ్‌తో మాట్లాడి మృతదేహాన్ని మృతుని స్వగ్రామమైన తిమ్మక్కపల్లి గ్రామానికి తీసుకురావాలని సూచించిన వెంటనే శ్రీనివాస్‌రావు బృందం గల్ఫ్ జేఏసీ ఉపాధ్యక్షులు మురళీధర్‌రెడ్డి వెంటనే స్పందించి మృతదేహాన్ని ఉచితంగా తెప్పించడానికి కృషి చేశారు. శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మృతదేహం చేరుకోగా, అక్కడి నుండి మృతుని ఇంటికి అంబులెన్స్ ద్వారా పంపడం జరిగింది. మృతదేహాన్ని తెప్పించడంలో సహకరించిన అధికారులకు, రాజా శ్రీనివాసరావు బృందానికి ఎంపీ రఘునందన్‌రావు ధన్యవాదాలు తెలిపారు. మృతదేహం మృతుని గ్రామానికి రాగానే అంత్యక్రియలు జరిగాయి. ఈ అంత్యక్రియల్లో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా విడుదల

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13,ప్రభాతవార్త:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం చిన్నశంకరంపేట పట్టణ ఓటరు జాబితాను పంచాయతీ అధికారులు శుక్రవారం నాడు విడుదల చేశారు. ఈవో సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఓటరు జాబితా వార్డుల వారిగా పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు ఓటరు జాబితాను సరిచూసుకోవాలని, తప్పులు ఉన్నట్లయితే నేటి నుండి 21వ తేది వరకు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఆయిల్‌ఫామ్ సాగులో మెదక్ జిల్లా అగ్రస్థానంలో నిలవాలి

- తక్కువ పెట్టుబడి, శ్రమతో కూడిన ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు
- 2024-25 సంవత్సరానికి జిల్లాలో 2 వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్13 ప్రభాతవార్త:**

ఆయిల్ ఫామ్ సాగులో మెదక్ జిల్లా అగ్రస్థానంలో నిలవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెదక్ పట్టణంలోగల నస్కెట్ ఏరియాలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ఆయిల్‌ఫామ్ తోటలకు అనుకూలంగా ఉందని ఆయిల్ ఫామ్ పరిశోధన సంస్థ పెదవేరి మండలం ఏలూరుజిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్రవేత్తలు జిల్లాను సందర్శించి ధ్రువీకరించడం జరిగిందని తెలిపారు. 2024-25 సంవత్సరానికి మెదక్ జిల్లాలో రెండు వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ తోటల సాగుకు ప్రణాళిక వేసుకోవడం జరిగిందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 1176 ఎకరాల ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని, ఇప్పటి వరకు 25 ఎకరాల ఆయిల్ ఫామ్ తోటలు పెట్టడం జరిగిందని చెప్పారు. 2023-24 సంవత్సరం మెదక్ జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు నిమిత్తం రైతులకు మొక్కలు సరఫరా చేయుటకు, దిగుబడిని కొనుగోలు చేసి నూనె ఉత్పత్తి చేయుటకు ఈ జిల్లాలో ఫ్యాక్టరీ నిర్మించుటకు లివింగ్ ఫుడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్ నెంబర్ 25 ద్వారా జారీ చేయడం జరిగిందన్నారు. లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు మొక్కలు ఉత్పత్తి చేయుటకు చల్మేడ గ్రామం నిజాంపేట మండలంలో 43 ఎకరాల స్థలంలో నర్సరీని స్థాపించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 2023-24 సంవత్సరంలో 74 మంది రైతులు 336 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేయడం జరిగిందని, ప్రభుత్వం ద్వారా 336 ఎకరాలకు సంబంధించి 13 లక్షల రూపాయల సబ్సిడీని రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలపై 90 శాతం రాయితీ సదుపాయం కల్పించబడునని చెప్పారు. ఒక ఎకరానికి ఆయిల్ ఫామ్ మొక్కలకు రూ.9,650 మొదటి సంవత్సరం సబ్సిడీ ఇవ్వడంతో పాటు అంతర పంటల సాగుకు మొదటి, రెండవ, మూడవ, నాలుగవ సంవత్సరాలకుగాను రూ.26,450 సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం తరువాత నిరంతర దిగుబడి 10 నుంచి 12 టన్నుల దిగుబడి సాధించవచ్చని, ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్ ఫామ్ గెల రూ.14,500 అని, ఈ లెక్కన సంవత్సరానికి 1 లక్షా 74 వేల ఆదాయం వచ్చునని, అన్ని ఖర్చులు పోను సంవత్సరానికి ఒక ఎకరానికి 1 లక్షా 20 వేల ఆదాయ సమకూరుతుందని వివరించారు. కంపెనీ వారు గెలలను కొనుగోలు చేసిన తరువాత నియమ నిబంధనల ప్రకారం 14 రోజుల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. మెదక్ జిల్లాలోని రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన పెంచుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టి ఇతర పంటల కంటే అధిక దిగుబడులు, లాంభం పొందాలని ఆకాంక్షించారు. ఇతర వివరాల కోసం ఉద్యానవనాధికారి మెదక్ (8977714423), ఉద్యనవనాధికారి నర్సాపూర్ (8977714422)లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టి పరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్ సింగ్, ఉద్యానవన అధికారులు రచన, సంతోష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్, లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ, జిల్లా ఆయిల్ ఫామ్ విస్తరణాధికారులు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్ ఫామ్ మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్



సింగూరు ప్రాజెక్టు దృశ్యం

## సింగూరు ప్రాజెక్టుకు తగ్గిన వరద

**-29648 టిఎంసిలకు చేరిన నీటి మట్టం**

**పుల్కల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గడంతో బుధవారం సాయంత్రం ఎత్తిన ప్రాజెక్టు గేటును మూసేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 29917 టీఎంసిలుగా కాగా ఇప్పటి వకనఎ 29648 టీఎంసిల నీరు నిల్వ ఉంది. మంగళవారం రాత్రికి ప్రాజెక్టులోకి వరద ప్రారంభం కావడంతో బుదవారం ఉదయం 11వ నంబరు గేటును ఎత్తి 8142 క్యాసెక్కులు, జెన్‌కో ద్వారా 2842 క్యాసెక్కుల నీటిని దిగువకు వదిలారు. బుధవారం సాయంత్రం నుంచి ప్రాజెక్టులోకి వరద నీరు రాకపోతుండటంతో ఎత్తిన ప్రాజెక్టు గేటును మూసివేశారు. ప్రస్తుతం జెన్‌కో ద్వార 2823 క్యాసెక్కులు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులో29648 టీఎంసిల నీటి మట్టంకు చేరుకుంది.

## కమాన్ ఏర్పాటుకు భూమి పూజ

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** పట్టణంలోని సాయిబాబా కాలనీకి బైపాస రోడ్డు నుంచి వెళ్లే దహదారి ప్రారంభంలో ముఖద్వారం కమాన్ ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయ కమిటి బాధ్యులు కాలనీ వాసులు యేసురెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ముఖద్వారం కమాన్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

### బ్యాంక్ మేనేజర్‌ను మోసగించిన

## సైబర్ నేరస్థుడి అరెస్టు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిద్దిపేట సైబర్ పోలీసులు శుక్రవారం హైదారాబాద్‌లోని హైటెక్ సిటీ మాదాపూర్‌లో సైబర్ నేరస్తుడిని అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలో ఓ బ్యాంకు మేనేజర్‌కు అనకాపల్లి జిల్లాకు చెందిన (ప్రస్తుత నివాసం మాదాపూర్ హైటెక్ సిటీ) భీమిశెట్టి వెంకటరామ్‌నాయుడు ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ లింక్ పంపాడు. అధిక లాభాలకు ఆశపడిన బ్యాంకు మేనేజర్ 25 రోజులుగా రూ.80 లక్షల పెట్టుబడి పెట్టారు. అనంతరం నిందితుడికి ఫోన్‌చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానంతో జాతీయ సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫోన్ చేయగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తులో భాగంగా రూ.20 లక్షల ఫ్రీజ్‌చేసి మేనేజర్‌కు ఇప్పించారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించి నిందితుడిని హైదారాబాద్‌లోని హైటెక్ సిటీలో అరెస్టుచేసి సైబర్ క్రైమ్ పోలీసులు రిమాండ్‌కు పంపించారు. నిందితుడివద్ద రూ.50వేల నగదు, సెల్‌ఫోన్, రెండు బ్యాంకులకు సంబంధించిన చెక్కులను స్వాధీనం చేసుకున్నారు.

## నర్సాపూర్‌లో సైబర్ మోసం

**భారత్ పే పేరుతో రూ. లక్షా 28 వేల ఘరానా మోసం**

**నర్సాపూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** నర్సాపూర్‌లోని ఓ కిరాణ దారుడి ఖాతాలో నుంచి భారత్ పే పేరుతో లక్షా 28 వేల రూపాయిలు మాయంకాగా ఘరానా మోసం చేసిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు బాధితుడి కథనం ప్రకారం ఇలా వున్నాయి... నర్సాపూర్‌కు చెందిన ఇమ్మడి విశ్వనాథం బాలాజి కిరాణా జనరల్ స్టోర్స్‌ను నడిపిస్తు జీవనం సాగిస్తున్నాడు. గతంలో బారత్ పే సౌండ్ బాక్స్ కోసం రూ. 4 వేల చెల్లించాడు. డబ్బులు చెల్లించినా వారు సౌండ్ బాక్స్ పంపించ లేదన్నారు. బారత్ పే వారితో ఫోన్‌లో మాట్లాడగా మీ డబ్బులు అకౌంట్‌లో వేశామని చెప్పారన్నారు. వారికి బ్యాంక్ స్టేట్‌మెంట్ పంపించినా అక్కడి నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. అయితే బుధవారం సాయంత్రం ఒక వ్యక్తి బారత్ పే టీ షర్ట్ వేసుకొని విశ్వనాథం కిరాణ దుకాణానికి వచ్చాడని తెలిపారు. దుకాణ యజమాని విశ్వనాథం తన సమస్యను వచ్చిన వ్యక్తికి వివరించాడు. సదరు వ్యక్తి మీ ఫోన్ నుంచి మెస్సేజ్ పెట్టాలని చెప్పి మీ అకౌంట్ నుంచి ఒక రూపాయి పంపించమని అన్నాడని తెలిపారు.అలా చెప్పడంతో తనకున్న అకౌంట్ నుంచి ఒక రూపాయి పంపించానన్నారు. ఆతర్వాత మెస్సేజ్ పెడతానని తన ఫోన్ తీసుకొని 1 లక్ష రూపాయిలు క్రెడెట్ కార్డు నుంచి 28 వేలు తన అకౌంట్ నుంచి కాజేసి అక్కడినుండి జారుకున్నాడని తెలిపారు. వెంటనే ఫోన్ బ్యాలెన్స్ చూసుకొని డబ్బులు పోయాయని వెంటనే 1930 సైబర్ క్రైమ్‌కు కాల్ చేయగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఇది సైబర్ క్రైమ్ కిందకు వస్తుందని తెలిపారు. అయితే మరుసటి రోజు గురువారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా వారు కేసు నమోదు చేశారని తెలిపారు.అంతేగాక సదరువ్యక్తి అకౌంట్ సీజ్‌చేసినట్లు తనకు మెస్సేజ్ వచ్చిందని బాధితుడు విశ్వనాథం తెలిపారు.ఈ మేరకు ఈ దుండగుడి కోసం ఎంత వెదికినా దొరకలేదని బాధితుడు విశ్వనాథం తెలిపారు.

## అప్పుల బాధ భరించలేక యువకుడి ఆత్మహత్య

**దుబ్బాక, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక పట్టణంలో శుక్రవారం జరిగింది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక పట్టణానికి చెందిన మర్కంటి నరేష్(37) హమాలి పని చేసుకుంటు కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అలాగే ఆరోగ్యం బాగలేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అప్పు చేయడం జరిగింది. అప్పులు అధికంగా కావడంతో ఇల్లు, బైక్‌ని అమ్మి కొంతవరకు అప్పు కట్టడం జరిగింది. మరి కొంత అప్పు ఉండగా అప్పు తీర్చే మార్గం లేక అలాగే ఆరోగ్యం బాగ లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన నరేష్ గురువారం అర్థరాత్రి సమయంలో రెండు పడకల ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ గంగరాజు తెలిపారు.



రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

## రాష్ట్ర స్థాయి క్రీడలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

**కొండపాక, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12న జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ అండర్ 15 క్రీడాపోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా తరపున కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు సిహెచ్ శ్రావణ్ 9వ తరగతి, ఎం డి. జీశాన్ అలీ 8వ తరగతి నుండి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14, 15 తేదిలల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలల్లో పాల్గొంటారని పిజికల్ డైరెక్టర్ క్యాతం రాజ్‌కుమార్ తెలిపారు.

## అక్రమ అరెస్టులు చేయడం దారుణం


మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో బిఆర్ఎస్ నేతలు

**మర్కుక్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులను మర్కుక్ పోలీసులు శుక్రవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దాడి చేయడంతో పోలీసులు గాంధీని వదిలేసి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావును అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మండలంలో బిఆర్ఎస్ శ్రేణులు ఎలాంటి ఆందోళనలు చేపట్టకుండా ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయినవారిలో మాజీ ఎంపిపి పాండుగౌడ్, మాజీ వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, భాస్కర్, అశోక్, మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య, మాజీ ఉపసర్పంచ్ స్వామి, ప్రసన్నరెడ్డి, గీసు మల్లేశంలు ఉన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల మందస్తు అరెస్టు


పోలీస్ స్టేషన్‌లో బిఆర్ఎస్ నాయకులు

**వెల్దుర్తి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాయకులు హైదరాబాదకు వెళ్లకుండా శుక్రవారం స్థానిక పోలీసులు మందుస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ మధ్య జరిగిన వాగ్వాదంతో మండలం నుండి బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడులు చేయడం అవివేకమని, ప్రశ్నించే వారిపై అరాచకం సృష్టించడం, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. అనంతరం వారిని స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణాగౌడ్, తోట నర్సింలు, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌చందర్ గుప్త, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, సత్యానారాయణ, మహేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అరెస్టులు అప్రజాస్వామికం


బిఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డి, అరికెపుడి గాంధీ మధ్య కొనసాగుతున్న వివాదం నేపద్యంలో, పాడి కౌషిక్‌రెడ్డికి మద్దతుగా బిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలకు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌషిక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుండా బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం దారుణం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ శ్రేణులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుంట నరేష్, పోచయ్య, లాల్య, నాగరాజు, ఉదయ్, స్వామి తదితరులు ఉన్నారు.

## అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు

**దుబ్బాక, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఎమ్మెల్యేపై జరుగుతున్న దాడి నేపథ్యంలో భాగంగా శుక్రవారం ఉదయం దుబ్బాక పట్టణంలో అలాగే జిల్లా బిఆర్ఎస్ ఉపాధ్యాక్షుడు ఎల్లా రెడ్డి, మండలాధ్యక్షులు బానల శ్రీనివాస్, అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రవి, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాసంలతో పాటుగా సీనియర్ నాయకులను ముందస్తుగా సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుబ్బాక, భూంపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జీడిపల్లి రవి మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇలాంటి అరెస్టులు కొత్త కాదని, నాడు తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన పోరాటం ముందు ఇలాంటి సంఘటన చాల చిన్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని అడ్డంకులు, ఎన్ని ఇబ్బందులు చేసిన అక్రమంగా అరెస్ట్‌లు చేసిన బిఆర్ఎస్ పోరాటం ఆగదన్నారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలు ప్రజాక్షేత్రంలో తిరగకుండా చేస్తామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో సీనియర్ నాయకులు గన్నె భూంరెడ్డి, ఎండి ఖలీల్, ర్యాకం శ్రీరాములు, ఆస స్వామి, పర్స కృష్ణ, బోయ శ్రీనివాస్, ఉల్లెంగుల నరేష్, అయితం శ్రీనివాస్, సంద సిద్దిరాములు, తిరుపతి గౌడ్, కాముని నర్సింలు, జిడిపల్లి శ్రీనివాస్, సురేష్, ఎల్కాపల్లి స్వామి, మహాకాళి, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సంతృప్తి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 13) :** ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే సంతృప్తి లభిస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని పలు వార్డులలో గణేష్ మండపాల వద్ద పర్యటించి పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో చేపట్టారు. మున్సిపాలిటీలో 11వ వార్డు జిపి క్వార్టర్స్, 19వ వార్డు గాంధీనగర్ కాలనీ, 22వ వార్డు గణేష్ మండలపాలలో నిర్వహించిన పూజ, అన్నదాన కార్యక్రమాలలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్, కౌన్సిలర్ వెంకట్‌రాంరెడ్డి, పిల్లి శారదశేఖర్, బచ్చల నర్సింలు, ప్రేమలత, యుగేంధర్, కౌసల్య శంకర్, చెట్ల నర్సింలు, మానస యాదగిరి, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు రఘునాథ్ యాదవ్, చీపురి రవి పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్‌లు చేయడం సరికాదు

### రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ మాజీ మెంబర్ దేవి రవీందర్


బిఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

**కొండపాక, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

మాజీ మంత్రి హరీష్‌రావు అరెస్ట్‌ను నిరసిస్తు చలో హైదరాబాద్ వెళ్తున్న బిఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం పిరికి చర్య అని, ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడం మంచిది కాదని రైతుబంధు రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు, ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో వీఎసీఎస్ వైస్ ప్రెసిడెంట్ పిస్క అమరేందర్‌తో కలిసి మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్ట్‌లు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. ముందస్తు అరెస్ట్‌ల వల్ల మనిషి స్వేచ్ఛగా జీవించే హక్కులను హరించినట్లేనని ఆయన గుర్తు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి పాలించటం చేతకాక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నడని ఆరో పించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి పార్టీ మారిన ఎమ్మెల్యే ఆరికెపుడి గాంధీని పంపి దాడి చేయించడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని ముందుగా హౌజ్ అరెస్ట్ చేసిన పోలీసులు ఎమ్మెల్యే గాంధీని ఎందుకు అరెస్ట్ చేయలేదని నిల దీశారు. అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలకు ఒక న్యాయం ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలకు ఒక న్యాయామా అని ప్రశ్నించారు. తోటి శాసనసభ్యుడికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకొని మాజీ మంత్రి హరీష్‌రావు న్యాయంకోసం ఎమ్మెల్యేలతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లితే అరెస్ట్‌చేసి రాత్రి 2 గంటల వరకు వివిధ ప్రాంతాలు తిప్పడం దేనికి నిదర్శనమన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన శాసనసభ్యులను ఉగ్రవాదులు, మావోయిస్టుల మాదిరిగా ఎక్కడికి తీసుకెళ్తున్నారో చేప్పకుండా తిప్పడం పనికిమాలిన చర్య అన్నారు. అదే విధంగా త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రైతుబంధు మండల మాజీ కో ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, దర్గ మాజీ సర్పంచ్ లగిశెట్టి శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచులు బచ్చలి మహిపాల్, కిరణ్ కుమార్‌చారి, మల్లమారి రవీందర్, మాజీ ఎంపి టీసీ అరిగె అశోక్, బిఆర్ఎస్ నాయకులు మల్లం ఐలయ్య,

## పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నర్సాపూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** పట్టణంలో శుక్రవారం గిరిదీపం పాఠశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ గిరిదీపం నూతన స్కూల్ భవనానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చక్కని వసతి కల్పించేందుకు గిరిదీపం స్కూల్ యాజమాన్యం అధునాతన భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్ లు స్కూల్ యజయాన్యం ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రాంతీయ విభేదాలు సృష్టించి రాజకీయ లబ్దిపొందాలని చూస్తున్న కౌశిక్‌రెడ్డి ఇష్టాను సారంగా వ్యవహారించడం మానుకొని నోరు అదుపులోకి పెట్టుకొని మాట్లాడకపోతే తగిన గుణపాఠం తప్పదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్ (అత్తు) హెచ్చరించారు. సిద్దిపేటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన కౌశిక్‌రెడ్డి హుందాగా వ్యవహారించాల్సింది పోయి కనీసం ఏడాది గడవక ముందే అవగాహన లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్న సమయంలో చీరలు గాజులు ఇచ్చి చేర్పించుకున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులను చూసి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను డబ్బుల ఆశచూపి చేర్పించుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని జీర్ణించుకొని కౌశికిరెడ్డి పిచ్చి వ్యాఖ్యాలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జోలికి వస్తే చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు. కౌశిక్‌రెడ్డి శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు శంకర్, మధు, గయాజుద్దీన్, పరుశరాములు, రాకేష్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండిస్తున్నాం

### మాజీ జెడ్‌పిటిసి పబ్బ మహేష్ గుప్త, మండల అధ్యక్షుడు రమణగౌడ్

**శివ్వంపేట, సెప్టెంబర్ 13(ప్రభాతవార్త) :** పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని, బీఆర్ఎస్ నేతలపై దాడులను ఖండిస్తున్నామని మాజీ జెడ్పిటీసి పబ్బ మహేష్ గుప్త, మండల అధ్యక్షులు రమణగౌడ్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచిన ప్రజలకు ఇచ్చిన హమిలు నెరవేర్చకుండా నిర్లక్ష్యం వాయిస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా అరికెపూడి గాంది బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చెరేందుకు సిద్దం అవుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ పిఎసి చైర్మన్ పదవి ఇస్తమని ప్రకటిచడంతో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అయిన అరికెపూడి గాందికి బీఆర్ఎస్ కందువ కాపుతనని కౌశిక్ రెడ్డి ప్రకటిచడంతో కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడిని ఖండిస్తున్నామని అన్నారు. హరిష్ రావును అక్రమంగా అరెస్టు చేశారని పరామర్శకు వెళ్లిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు. వచ్చే ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వనికి ప్రజలు తగిన బుద్ది చేపుతరని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసి సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పచ్ రంగిలా అంజనేయులు, మాజీ ఎంపిటీసి దశరథ, ముత్యం రెడ్డి, వజ్ఞ హరి, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతూ పబ్బ మహేష్‌గుప్త, రమణ గౌడ్


మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

## బిఆర్ఎస్‌కు రుణమాఫీపై మాట్లాడే అర్హత లేదు

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

**నర్సాపూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాయకులకు రుణమాఫీపై మాట్లాడే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి రైతుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ బకాయి బిల్లులు దారి మళ్లించారని అనడం వాస్తవం కాదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలోనే గ్రామ పంచాయతీ వ్యవస్థ నాశనంఅయ్యిందని ఆరోపించారు. టిఆర్ఎస్ నాయకులు ప్రజల్లో గందరగోళం సృష్టించి కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రజలు అ ందరు సంతోషం వ్యక్తం చేస్తునాన్నరని అన్నారు. రైతులకు వంద శాతం రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. ప్రచార మాధ్యమాలు సమాజానికి ఎంతో అవసరమని ప్రజా స్వామ్య వ్యవస్థకు జర్నలీజం అనేది ఒక ఆయుధంలా బావించేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు కాంగ్రెస్ పార్టీపై. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పై లేనిపోని విమర్శలుచేస్తె ఊరుకునేది లేదని ఆయనను అడ్డుకుంటామని ఆంజనేయులుగౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు జ్యోతి సురేష్‌నాయక్, లలితనర్సింగ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేశం, రుస్తుంపేట అశోక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, మండల ఓబిసి అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, మైనార్టీ మండల అధ్యక్షులు అజ్మత్, మణిదీప్, వివిధ మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పోషణ మాసోత్సవం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** మండల పరిధి భాగిర్తిపల్లి అంగన్‌వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ పౌష్టికాహరం, ఆరోగ్యంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణిలు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహరం పంపిణి చేస్తుందన్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞచేయించారు. అంగన్‌వాడీ టిచర్లు వరలక్ష్మీ పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు

### నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు

**నర్సాపూర్ సెప్టెంబర్ 13. ప్రభాతవార్త:** సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సిపిఎం పార్టీకి తీరని లోటని సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు అన్నారు. శుక్రవారం నర్సాపూర్ డివిజన్ కమిటీ అధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు మాట్లాడుతూదేశస్థాయి లో రాజకీయాలపై సరైన విశ్లేషణతో పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం కృషి చేశాడని ప్రస్తుతం ఆయన లేకపోవడం సిపిఎం పార్టీకి తీరని లోటని అన్నారు. ప్రభుత్వాలు తీసుకొస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విదానాలను అనేక సందర్బాలలో రాజీలేని పోరాటాలతో ముందుకు వెళ్లిన గొప్పనాయకుడని అన్నారు. తెలుగు రాష్ట్రంలో పుట్టి డిల్లీ నుండి దేశ రాజకీయాలనే ప్రభావితం చేసేలా ఎదగడం అంటే ఆయన కృషి, పట్టుదల త్యాగం అంతులేనిదని అన్నారు. పోరాటాల ద్వార అనేక ఆటు పోట్లు వచ్చినాదేనికి లొంగకుండా పార్టీ ఎదుగుదలకు అహర్నిషలు పోరాడిన వ్యక్తి సీతారాం ఏచూరియేనన్నారు. ఆయన లేకపోవడం అంటె పార్టీ నమ్మలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు నాగభూషణం, నర్సింలు, శేఖర్, చంద్రయ్య, శంకర్ పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## గర్భిణీలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలి

**కొండపాక, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** గర్భిణీలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకొవాలని కుకునూరుపల్లి నోడల్ ఆఫీసర్ సత్తయ్య అన్నారు. శుక్రవారం మాత్‌పల్లిలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషకాహారం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎం దేవి నాగలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కువగా అకుకూరలు, గుడ్లు, పాలు తీసుకొవాలని సూచించారు. గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సరైన సమయంలో వ్యాక్సిన్‌లు తీసుకుని, ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొవాలని. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ , ఉపాధ్యాయుడు భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, కనకవ్వ, అశావర్కర్ లావణ్య పాల్గొన్నారు.

## పిఎం విశకర్మ యోజన కింద వడ్రంగి పనికి శిక్షణ

**కొండపాక, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** పిఎం విశ్వకర్మ యోజన (వడ్రంగి)కింద కుకునూరుపల్లి ఐటిఐలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైనట్లు ఐటిఐ ప్రిన్సిపల్ వెంకట రమణ తెలిపారు. అసక్తి గల వారు పి ఎం విశ్వకర్మ యోజన కార్యక్రమం ద్వారా తమ పేర్లను రిజిష్టర్ చేసుకొని ఆన్‌లైన్ రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 5 రోజులపాటు శిక్షణను ఇచ్చి రోజుకు రూ॥ 500 స్టైపండ్‌గా చెల్లించటం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసి ఉత్తీర్ణులైన వారికి రూ॥ 15 వేల విలువ గల టూల్ కిట్‌ను ఉచితంగా అందించబడుతుందన్నారు. ఎంపిక చేసిన వారికి తక్కువ వడ్డీతో కేంద్ర ప్రభుత్వం రూ॥ 3 లక్షల రుణ సహాయం అందిస్తుందని తలిపారు.

## భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర జరుపుకుందాం : సిఐ

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** భక్తిశ్రద్ధలతో వినాయక శోభాయాత్ర జరుపుకుందామని గజ్వేల్ సిఐ సైదా, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళిలు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు ప్రసంగించారు. మద్యం సేవించకుండా భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల మధ్య వినాయక నిమజ్జనం జరపాలని, శోభాయాత్రలో డిజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యుత్, విగ్రహం వద్ద దీపం విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని, సమన్వయం పాటిస్తూ ఏ చిన్న సంఘటన జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇతరులను రెచ్చగొట్టేవిధంగా వ్యవహరించవద్దని, స్నేహభావం, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేసుకుందామని తెలిపారు. అలాగే విగ్రహాల ఆర్గనైజర్లు తమకు సూచించిన ప్రదేశంలోనే నిమజ్జనం చేయాలని, శాస్త్ర ప్రకారం వేద పండితులు ప్రకటించిన విధంగా మున్సిపల్‌లో ఉన్న అన్ని వినాయక విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేయాలన్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న స్వాగత కార్యక్రమాలకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, గోపాల్‌రెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్, భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, ఉమర్, ఐవిఎఫ్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, వేద పండితులు నందబాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా నిమజ్జనాలు చేసుకోవాలి

**పాపన్నపేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** వినాయక చవితిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో ప్రతిష్టించుకున్న తొలిపూజలు అందుకునే పార్వతీ దేవి తనయుడిని భక్తి శ్రద్దలతో పూజలు చేసుకుంటున్న లంబోదరుడిని గంగమ్మ ఒడికి చేర్చే నిమర్జన కార్యక్రమాలు ప్రశాంతగా, శాంతియుతంగా, భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ మండల ప్రజలకు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు నిండుకుండాలా ఉన్నాయని, ఏకదంతుడిని నిమర్జనం చేసే తరుణంలో జాగ్రత్తగా బొజ్జగణపయ్యను గంగమ్మ తల్లి ఒడికి చేర్చాలని సూచించారు. రాత్రి అయ్యే లోపు విఘ్నేశ్వరుడిని నిమర్జనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మండపాల నిర్వాహకులకు, భక్తులకు సూచించారు. అధిక సౌండ్ ఉన్న స్పీకర్లు, డీజేలు ఉపయోగించకూడదని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన

**వెల్దుర్తి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచనల ప్రకారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్లు, యజమానులకు ఎస్ఐ రాజు అవగాహన కల్పించారు. ఆటోల పేపర్లను తనిఖీ చేయడం జరిగింది. పీఎస్ రిజిష్టర్‌లో నమోదు చేసుకొని, రిజిష్టర్ ప్రకారం వెల్దుర్తి నుండి తూప్రాన్, నర్సాపూర్, మెదక్‌కు వెళ్లే ఆటోలకు సీరియల్ నెంబర్లను ఇచ్చి ఎక్కడఉన్నా గుర్తు పట్టేలా రాయించడం జరిగిందన్నారు. ఇది నేర పరిశోధనకు, ఆలాగే ఆటోవారు ఎలాంటి తప్పులు చేయకుండా ఉండటానికి ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎస్ఐ రాజు తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, యజమానులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని రైతువేదిక భవనంలో సమావేశం నిర్వహించగా మండలంలోని 49 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 20 లక్షల రుపాయల చెక్కులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్లే మెదక్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకంజలో ఉందన్నారు. 50 కోట్ల రుపాయలతో చిన్నశంకరంపేట మండలం అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. తొమ్మిది సంవత్సరాలలో మండలంలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలుసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామిని నేరవెర్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, గృహజ్యోతివంటి పథకాలను, ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. మెదక్‌కు మెడికల్ కళాశాల వస్తుందని, త్వరలోనే మెడికల్ కళాశాలను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఆర్ఐ చందు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ పట్టణ సర్పంచి రాజిరెడ్డి, మాజీ రామాయంపేట మార్కెట్ కమిటి చైర్మన్ గంగా నరేందర్, నాయకులు మేడి గణేష్, ప్రభాకర్, వెంకట్, కోదూరి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** సిజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి నిలిమ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో డ్రై డేలో భాగంగా ఆశాలు, అంగన్‌వాడీలకు ఆమె పలు సూచనలు చేశారు అనంతరం దుర్గామాత కాలనీలో పర్యటించి పట్టణవాసులకు అవగాహన కల్పించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వ గుంతలు ఉంచకుండా చూసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది జ్వరం వచ్చిన వారిని గుర్తించి వారికి అవసరమై మందులను అందించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఈవో సంతోష్‌లు ఉన్నారు

# పోలీసులను అడ్డుపెట్టుకొని దుర్మార్గంగా ప్రవర్తిస్తున్న రేవంత్‌రెడ్డి

### ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):**

రాష్ట్రంలో పోలీసులను అడ్డంపెట్టుకొని దుర్మార్గంగా ప్రవర్తిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి పద్దతి మార్చుకోవాలని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గూండాలతో దాడిచేసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని వదిలిపెట్టి మాజీ మంత్రి హరీష్‌రావుతో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అక్రమ కేసు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. న్యాయబద్దంగా నామినేషన్ వేసిన మాజీ మంత్రి హరీష్‌రావుకు పిఎసి చైర్మన్ పదవి దక్కాల్సి వుండగా కాంగ్రెస్‌లో చేరిన అరికెపూడి గాంధీకి ఇవ్వడం దురదృష్టకరమని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలను వదిలిపెట్టమని, ఉద్యమనేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబం లక్ష్యంగా విమర్శలు చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి తన మోసపూరిత విధానాలు మానుకోవాలని సూచించారు.

**పోలీసుల అదుపులో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి ప్రతాప్‌రెడ్డి**

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడిచేసిన సంఘటనలో అరికెపూడి గాంధీని వెంటనే అరెస్ట్ చేయాలని గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నేపథ్యంలో గజ్వేల్ సిఐ సైదా అక్కడికి వెళ్ళి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి పంగ మల్లేశంలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి సొంతపూచీకత్తుతో విడుదల చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, ఉప్పల మెట్టయ్య, బబ్బూరి రజితగౌడ్, బాలమణి శ్రీనివాస్‌రెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్‌గుప్త, బొగ్గుల చందు, అరుణ భూపాల్ రెడ్డి, ఐవిఎఫ్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్‌గుప్త, గంగిశెట్టి రవి, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ ఎల్ల వెంకటేశ్, దయాకర్‌రెడ్డి, కల్యాణ్‌కార్ నర్సింగరావు, శ్రీధర్, స్వామిచారి, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఇంజన్‌లో మంటలు

### తప్పి పెను ప్రమాదం

**కొండపాక, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సులో ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలను ఆర్పి ప్రయాణికులకు కుకునూరు పోలీసులు రక్షించారు. సంఘటన వివరాలు.. శుక్రవారం కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుండి హైదరాబాద్ వెళ్తున క్రమంలో రాజీవ్ రహదారిపై మేదినిపూర్ శివారులోకి ప్రమాదవశాత్తు బస్సు ఇంజన్ నుండి పొగలు రావడంతో గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఇంజన్‌లో చెలరేగిన మంటలను నీళ్లు చల్లి ఆర్పివేశారు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా సిపి అనురాధ ఎస్సై శ్రీనివాస్‌తోపాటు హెడ్‌కానిస్టేబుల్ రమణమూర్తి, సిబ్బంది శేఖర్, రాకేష్, శ్రీనివాస్, వంశీలను అభినందించారు.


బస్సులో మండలను అర్పుతున్న కుకునూరుపల్లి పోలీసులు



దర్గా ఉత్సవాల ముగింపులో మాట్లాడుతున్న పీఠాధిపతులు

## ముగిసిన దర్గా ఉత్సవాలు

**మనూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాయిపల్లిలో కొనసాగిన దర్గా ఉత్సవాలు శుక్రవారం ప్రశాంతంగా ఘనంగా ముగిసాయి. గ్రామంలోని దర్గాలో 39వ ఉర్సు షరీఫ్ హజ్రత్ సూఫీ షా మొహమ్మద్ రోషన్ అలీ 25వ హజ్రత్ సుపిషా మహమ్మద్ హాషామ్ అలీ దర్గా ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఉర్సు ఉత్సవాలకు ఆయా గ్రామాలతో పాటు కర్ణాటక, మహాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దార్గకు చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**మనూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాయిపల్లిలో కొనసాగుతున్న హజ్రత్ సోఫీ రోషన్ అలి దర్గా ఉత్సవాల్లో శుక్రవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ ఎమ్మెల్యేను ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు పాటిల్, మండల కో-ఆప్షన్ సభ్యులు సలీం, మాజీ ఎంపిటిసి సభ్యులు ముజామిల్ తాలుకా కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్గొండ, నాయకులు షఫీపటేల్, ముజీబ్, రైపుమియా, మాజీ సర్పంచ్ రాజేందర్‌రావు, వెంకట్‌రావు, మాణిక్యం, పోఫీ, హన్నుమియా, ఖదీర్, జంషిద్ మియా, సమీ, మహమ్మద్, వాజీద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందచేసిన ఎమ్మెల్యే



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగిన మండలస్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణ జాదవ్ ఆధ్వర్యంలో బహుమతులు అందచేశారు. అండర్ 13 బాలురు, బాలికలు, అండర్ 17 బాలురు, బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడిఓ మహేశ్వర్‌రావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, ఎస్ఐ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సేట్, నాయకులు సంజు పాటిల్, బస్వరాజ్, సచిన్ పాటిల్, కాంశెట్టి అశోక్ చౌహాన్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి



మెటల్‌కుంటలో వీధులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ అమృత ఎంపిఓ సురేష్

**న్యాల్‌కల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రజలు సహకరించాలని డిఎల్‌పిఓ అమృత సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మెటల్‌కుంట, కల్బేమల్, బసంత్‌పూర్ తదితర గ్రామాలను డిఎల్‌పిఓ అమృత మండల పంచాయతీ అధికారి సురేష్‌తో కలిసి పరిశీలించారు. శుక్రవారం సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే ఫ్రైడే డ్రైడే పనులను, గ్రామాల్లోని వీధులను, మురుగు కాల్వలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం ఉంటామని, అందుకు ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అమృత సూచించారు.

## వేలంలో గణపతి లడ్డూను దక్కించుకున్న మాజీ సర్పంచ్

**న్యాల్‌కల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మండలకేంద్రంలో మల్లికార్జున స్వామి ఆలయంలో వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతిష్టించుకుని నిత్యం పూజాకార్యక్రమాలు అందుకున్న లంబోదరుడి చేతిలోని లడ్డూలను గురువారం రాత్రి వేలం వేశారు. వేలం పాటలో మొదటి లడ్డూను రూ. 56వేలకు గొల్ల దత్తు దక్కించుకోగా రెండవ లడ్డూను మల్గి గ్రామ మాజీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షులు జెట్‌గొండ మారుతి దక్కించుకున్నారు. వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నవారికి ఉత్సవ కమిటి నిర్వాహకులు శాలువాలతో సత్కరించి లడ్డూలను అందచేశారు.

## ఎమ్మెల్యే ఇంటిపై దాడి హేయమైన చర్య

**-బిఆర్ఎస్ రాష్ట్ర నేత పైతర సాయికుమార్**

**మునిపల్లి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేయడం, హరీష్‌రావు ఆరెస్టు చేయడం హేయమైన చర్యగా ఆ పార్టీ నేత పైతర సాయికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సాగుతున్నది ప్రజా పాలన కాదని, అప్రజాస్వామిక పాలన అని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై గూండాలతో దాడి చేయించడం ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను బలవంతంగా వాహనాల్లో కుక్కి వందల కిలోమీటర్లు తిప్పడం చూస్తుంటే పాలకుల శాడిజం ఎంత పెరిగిందో తెలుస్తోందని విచారం వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును వెంటనే విడుదల చేయాలని సాయికుమార్ డిమాండ్ చేశారు.

## వినాయక మండపంలో మహిళల కుంకుమార్చన

**పాపన్నపేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నవ యువ సేవా సమితి సంఘం గణేష్ మండలి ఆధ్వర్యంలో కొనసాగుతున్న వినాయక మండపంలో శుక్రవారం మహిళలు కుంకుమార్చన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండపం ఆవరణలో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బహుమతులు అందచేశారు. లంబోదరుడికి ఎస్ఐ, మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంగన్న, మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, నాయకులు నరేందర్‌గౌడ్, చోటు, ఉపాధ్యాయులు నాగరాజు, నవయువ సేవా సమితి సంఘం బాధ్యులు సురేందర్‌సింగ్, ఆంజనేయులు, సాయి, ప్రశాంత్, వికాస్, నితిన్, దిలీప్, శరత్, భాస్కర్, లింగం, శివాజీ, సంతోష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.





గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



తెల్లాపూర్‌లో అరెస్టయిన బిఆర్ఎస్ నాయకులు



బిఆర్ఎస్ నేతలను ఝరాసంగం పోలీసు ఠాణకు తరలించిన దృశ్యం



బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి మనూర్‌ఠాణకు తరలించిన పోలీసులు



బిఆర్ఎస్ నేతలను అల్లాదుర్గం పోలీసు ఠాణకు తరలించిన పోలీసులు



బిఆర్ఎస్ నేతలను పాపన్నపేట పోలీసు ఠాణకు తరలించిన దృశ్యం

# బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బిఆర్ఎస్ నాయకులు

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
ఎమ్మెల్యేలు హరీష్‌రావు, కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని బిఆర్ఎస్ పార్టీ పిలుపునివ్వడంతో పోలీసులు ఆ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టుచేసి జహీరాబాద్ పోలీస్ ఠాణాకు తరలించారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, ఇప్పేపల్లి సొసైటీ చైర్మన్ మచెందర్, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎండి యాకూబ్, మాజీ సర్పంచ్‌లు చిన్నరెడ్డి, జగదీశ్వర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు హీరు రాథోడ్, బీమ్‌రావు, శ్రీకాంత్, ఎండి ముఖీమ్, ఎండి షకీల్, ఎస్సీ సెల్ నాయకులు బండి మోహన్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు.

**రామచంద్రాపురంలో...**

**రామచంద్రాపురం, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో ప్రజాపాలన కాదు రౌడీపాలన కొనసాగుతోందని తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి నేపథ్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని బిఆర్ఎస్ పార్టీ పిలుపు నివ్వడంతో పోలీసులు బిఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు ఠాణాలకు తరలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బాలగౌని రాములుగౌడ్‌ను ఆరెస్టు చేసి బిడిఎల్ బానూర్ పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో అక్రమ అరెస్టులు, దాడులు జరగలేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభివృద్ధిని విస్మరించి ఆందోళనను, దాడులు, అరెస్టులు చేస్తూ నియంతృత్వ పాలన చేస్తోందని విమర్శించారు.

**ఝరాసంగంలో...**

**ఝరాసంగం, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్న బిఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఝరాసంగంలోని పోలీసు ఠాణాకు తరలించారు. అరెస్టు అయిన వారిలో మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు బొగ్గుల జగదీశ్వర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశం, మాజీ మండల అధ్యక్షులు సంగమేశ్వర్, నాయకులు ఎంపి నాగేష్, ఏజాజ్ బబా తదితరులు ఉన్నారు.

**మనూర్‌లో...**

**మనూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
ఎమ్మెల్యే హరీష్‌రావు అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్ తరలివెళుతున్న బిఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి మనూర్ పోలీసు ఠాణాకు తరలించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి, ఎమ్మెల్యే హరీష్‌రావును అక్రమంగా అరెస్టుచేయడం హేయమైన చర్యగా బిఆర్ఎస్ నాయకులు అభివర్ణించారు. అరెస్టయిన వారిలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావుపాటిల్, మాజీ జడ్పీటిసి సభ్యులు, నాయకులు నాగేందర్, సిహెచ్ చంద్రకాంత్, ఆశయ్య, సమ్మీ, వజీద్ మియా, వడ్ల సంగన్న, ఇంతియాజ్, సిహెచ్ గుండప్ప, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నాగప్పపాటిల్ మల్లేష్ ఉన్నారు.

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి, ఎమ్మెల్యే హరీష్‌రావు అక్రమ అరెస్టును శుక్రవారం నిరసన కార్యక్రమాలకు ఆ పార్టీ నాయకులు దిగనున్నట్లు తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అల్లాదుర్గం పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు పల్లెగడ్డ నరసింహులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిని అరెస్టు చేయకుండా బిఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గాంధీ అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో కాయూతంపల్లి మాజీ సర్పంచ్ బేతయ్య, మాజీ ఎంపిటిసి సభ్యులు దశరథ్ తదితరులు ఉన్నారు.

**పాపన్నపేటలో...**

**పాపన్నపేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని బిఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అరెస్టును నిరసిస్తూ పార్టీ పిలుపుమేరకు శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్న బిఆర్ఎస్ నేతలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచులు గురుమూర్తిగౌడ్, లింగారెడ్డి, బద్రి మల్లేశం, నాయకులు శ్రీనివాస్, లింగం ఉన్నారు.

**గుమ్మడిదలలో...**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి చేయడం అమానుషం అని ఆ పార్టీ నేత, సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి మద్దతుగా గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలి వెళ్తుంటే గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్యకర్తలను అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచికత్తుతో విడుదల చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని వెన్నుపోటు పొడిచిన ఎమ్మెల్యే అరికెపుడి గాంధీలాంటి వ్యక్తిని ప్రజలు ఎప్పుడూ క్షమించరని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, గౌరీశంకర్‌గౌడ్, మాజీ సర్పంచి చిమ్ముల నరసింహారెడ్డి, రాజశేఖర్, సూర్యనారాయణ, అమ్మగా రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రమేష్, బీరప్ప, నరహరి, తుపాకుల రాజు, గోపాల్, హరికృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో బిఆర్ఎస్ నాయకులు

## తెలంగాణలో నయా నిజాం పాలన సాగుతోంది

**కొల్చారం, సెప్టెంబర్13 ప్రభాతవార్త:** తెలంగాణలో నయా నిజాం పాలన సాగుతోందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్ గుప్త, యువత విభాగం అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, కొమ్ముల యాదాగౌడ్ అన్నారు. శుక్రవారం కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని నిరసిస్తూ మాజీ మంత్రి హరీష్‌రావు పిలుపు మేరు బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో స్థానిక పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. కొల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించి అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గ్యాస్ కృష్ణ, చిన్న రాములు, ఎండుగుల కృష్ణ, రాజాగౌడ్, చెన్నయ్య, దుర్గాప్రసాద్‌గౌడ్, సంతోష్ కుమార్, నర్సింలు, లక్ష్మయ్య, సత్యాగౌడ్, లక్ష్మయ్య, గౌరీశంకర్, తలారి దుర్గేష్, సోమ నర్సింలు, ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలి

**-ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుర్ర మహేష్**

**కొల్చారం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు నూతన పింఛన్లు మంజూరు చేస్తూ.. పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలని ఎంఎస్ఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పుర్ర మహేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వితంతు మహిళలు పింఛన్లకు దరఖాస్తు చేసినప్పటికీ ఇంతవరకు రాకపోవడంతో వారు చాలా అవస్థలు పడుతున్నారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేస్తూ, నూతన పింఛన్లను మంజూరు చేస్తూ దివ్యాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.4000 పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ తరపున విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

## తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో ఉచిత వైద్య శిబిరం

**సంగారెడ్డి మున్సిపాలిటి సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
సంగారెడ్డిలోని తెలంగాణ గ్రామీణవికాస్ బ్యాంక్‌లో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి మరియు సాహితి హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి చైర్మెన్ వనజారెడ్డి, సాహితి ఆసుపత్రి డైరెక్టర్ రాము, కోషాదికారి ప్రసాద్, యూత్ కన్వీనర్ ఆశాష్ ప్రీతం, వైద్యులు శ్రీనివాస్, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆర్.ఎం. సమత, చీఫ్ మేనేజర్ హరీష్, రామకృష్ణ, పి.నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహాలక్ష్మీ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

**గుమ్మడిదల, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గ్రామ కార్యదర్శి ప్రభాకర్ స్థానిక నాయకులతో కలిసి మహాలక్ష్మీ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రూ.500 కే గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యదర్శి ప్రభాకర్, నాయకులు మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, కాంగ్రెస్ యువ నాయకులు మూడు చింతల నరేందర్‌రెడ్డిలు లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారంటీలను అమలు పరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఆకుల ఆంజనేయులు, లలిత, పడమటి మహిపాల్‌రెడ్డి, కవ్వం రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, గ్రామ పంచాయితీ సిబ్బంది, కామేశ్వరి, జైచిత్ర, సరిత తదితరులు పాల్గొన్నారు.

## హత్నూర మండలంలోని కుంటలను పరిశీలించిన ఇరిగేషన్ అధికారుల బృందం

**హత్నూర సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** హత్నూర మండలం తుర్కలఖానపూర్, నస్తీపూర్, దౌల్తాబాద్, చందాపూర్ గ్రామాల పరిధిలోని చెరువులు, కుంటలను శుక్రవారం ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అదేశాలమేరకు ఇరిగేషన్ డిప్యూటి ఇఇ ఎం.రవికుమార్, ఎఇఇలు భూపుత్ర, వందనలతో పాటు లష్కర్‌లతో కూడిన అధికారుల బృందం చందాపూర్ గ్రామం పరిధిలోని బోడకుంట, పీన్లకుంట, వెనక చెరువులను పరిశీలించారు. అక్రమణలకు గురిఅయ్యాయా, నిర్మాణాలు చేపట్టారా అనే విషయాలను పరిశీలించారు. కొన్ని కుంటలను అక్రమణలకు గురైనట్లు గుర్తించారు. తుర్కలఖానాపూర్ పుస్తఫాగారికుంటా, నస్తీపూర్ కొత్తకుంటా, దౌల్తాబాద్ పరిధిలోని ఇటుకాలకుంటా (పోగాకుకుంటా)లను పరిశీలించారు. పరిశీలించిన నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

## 1లక్ష 62 వేలకు లడ్డూను దక్కించుకున్న వినయ్

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణంలోని హిందు వాహిని గణేష్ లడ్డును 1 లక్ష 62వేల రూపాయలకు వేలం పాటలో వ్యాపారి సారంగొ వవినయ్ దక్కించుకున్నారు. రెండవ లడ్డును ఉపాధ్యాయులు ముత్యాల మహేష్ రూ. 52 వేల దక్కించుకోగా ఉత్సవ కమిటి బాధ్యులు శాలువాలతో సత్కరించి లడ్డులను అందచేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గణపతి లడ్డును వినయ్‌కు అందచేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న నాగులగారి మల్లేశంగౌడ్

## పార్టీ శ్రేణులు గాంధీభవన్‌కు తరలిరండి

**-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్**

**కొల్చారం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** పీసీసీ నూతన అధ్యక్షులుగా పదవీ బాధ్యలు చేపట్టనున్న బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపడానికి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు ఆ పార్టీ శ్రేణులు తరలి రావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి ఆదేశాల మేరకు 15వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రమైన కొల్చారం నుండి నర్సాపూర్‌కు వెళ్లడానికి మండల కార్యవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రజా పాలనలో భాగంగా నేడు ఒక బీసీ బిడ్డను పీసీసీ అధ్యక్షులుగా నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీలకు మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవన్నగారి శేఖర్, అనిల్, మహేశ్వర్‌రెడ్డి, అక్రమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## గ్రామ పంచాయతీల్లో డ్రాఫ్ట్ ఓటరు లిస్టులు

**-212 వార్డుల్లో 37312 మంది ఓటర్లు**

**కంది, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని 22 గ్రామ పంచాయతీలతోపాటు మండల పరిషత్ కార్యాలయంలో వార్డు వారీగా డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులను జిల్లా పంచాయితీ అధికారి ఆదేశాల మేరకు ప్రబ్లిష్ చేశారు. మండలంలోని 22 గ్రామ పంచాయితీల్లో 212 వార్డులు ఉండగా 37312 మంది ఓటర్లు ఉన్నారు. 18870మంది పురుషులు, 18420 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 22 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. ఈ నెల 14వ తారీఖు నుంచి 21వ తేదీ వరకు అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల పంచాయితీ అధికారి మహేందర్‌రెడ్డిలు సూచించారు.

**నాగాల్‌గిద్ద గ్రామ పంచాయితీల్లో...**

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు, జిల్లా పంచాయితీ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లోని పంచాయితీలలో వార్డుల వారిగా డ్రాఫ్ట్ ఓటరు లిస్టులను ప్రచురించారు. ఈ నెల 14వ తారీఖు నుంచి వారం రోజుల పాటు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిష్కరించి తుది ఓటర్ జాబితా లిస్టులను సెప్టెంబరు 21న ప్రచురిస్తామని ఎంపిడిఓ పేర్కొన్నారు.

## వినాయకుడికి పూజలు చేసిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతీనగర్, రామచంద్రాపురం డివిజన్‌లలోని కొలువు దీరిన విఘ్నేశ్వరుడిని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఎంఐజి కాలనీ, నేతాజీ హాల్, వివేకానంద గ్రౌండ్, శ్రీ గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో కార్పొరేటర్ సింధూ పాల్గొన్నారు.

## అప్పాజిపల్లి మొగుళ్ల చెరువు కట్టకు గండి

**కొల్చారం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మండల పరిధిలో భారీ వర్షాలు కురవడంతో అప్పాచిపల్లి మొగుళ్ల చెరువు కట్టకు గండీ పడటంతో కట్ట కింది పొలాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచి సునితా వెంకట్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఫహద్ పాషాల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి గండి పడిన కట్టకు ట్రాక్టర్లతో మొరం పోసి గండిని పూడ్చివేశారు. గండిని పూడ్చడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచి సునీత వెంకట్‌గౌడ్, ఫహద్ పాషాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌గౌడ్, పంచాయితీ సెక్రటరీ ఫణీంద్ర, కోరంపల్లి వెంకటేశం, చింతల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి హౌస్ అరెస్టు



పద్మాదేవేందర్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్13 ప్రభాతవార్త:**
బీఆర్ఎస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులపై మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ కోంపల్లిలోని వారి నివాసంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డిని కోంపల్లి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్‌నాయకుల ముందస్తు అరెస్టుల పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుండా బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన ఎమ్మెల్యేనయ గాంధీ, వారి అనుచరులను, కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయాలన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులను, కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేశారని, వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ఆర్‌కె. శ్రీనివాస్, జయరాజ్, హవేళిఘనపూర్, మెదక్ మండలాల నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు జయరాంరెడ్డి, సాప సాయిలు, ఆంజనేయులు, ప్రభాకర్, ఎలక్షన్ రెడ్డి, గంజి నవీన్, శ్రీనివాస్‌గౌడ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.